క్లుప్తంగా

కనక దుర్గమ్మకు అన్నాభిషేకం

మంగళగిరి: పట్టణంలోని కనకదుర్గ అమ్మవారికి మంగళవారం అన్నాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు, భవానీలు అధిక సంఖ్యలో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఫిరంగిపురం: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని 104 అంబులెన్స్ ఉద్యోగులు కోరారు. తక్కెళ్లపాడు గ్రామంలో మంగళవారం వైస్ ఎంపీపీ మార్పుల విజయలక్ష్మీకి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తమకు నెలనెలా జీతాలు ప్రభుత్వం సక్రమంగా చెల్లించడం లేదని చెప్పారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు జీవో నంబరు 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని తెలిపారు. అరబిందో యాజమాన్యం నుంచి రావల్సిన బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, ఉద్యోగులు విజయ్‌కుమార్, సింగరాజు పాల్గొన్నారు.

భగవాన్ బిర్సాముండా జయంతి



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఆదివాసి స్వాంత్రత్య యోధుడు భగవాన్ బిర్సాముండా 150 జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శౌరీజోజి మాట్లాడుతూ ఝార్ఖండ్ ప్రజలను ఏకం చేయడంలో భగవాన్ బిర్సాముండా ప్రముఖ పాత్ర వహించారన్నారు. ఆదివాసులకు ఎన్నో సేవలందించిన ఘనత బిర్సాముండాకు దక్కుతుందని, ఆయనను వారు భగవత్స్వరూపంగా భావించి పూజిస్తారని చెప్పారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం భగవాన్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యా కార్యదర్శి వెంకటేష్ నాయక్, హెచ్‌ఎం దీవి.కమల్‌మోహన్ పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రైతులు పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి పి. శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా, పునః సంస్థాపిత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం ద్వారా రైతుల నమోదు ప్రక్రియ రబీ పంటల కోసం ప్రారంభమైందని పేర్కొన్నారు. మొక్కజొన్న ఎకరాకు రూ.114, జొన్నకు రూ. 48, మినుము పంటకు రూ.50, పెసరకు రూ.45, పప్పు సెనగ పంట రూ.70లు ప్రీమియం చెల్లించాలని, డిసెంబర్ 15 వరకు గడువు ఉందన్నారు. రుణాలు పొందిన రైతులు బ్యాంకుల ద్వారా నమోదై ఉంటారని, రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి స్పాట్ నమోదు చేసుకోవాలని, కామన్ సర్వీస్ సెంటర్‌లో ఇచ్చిన రసీదు ప్రకారం ప్రీమియం చెల్లించాలని తెలిపారు.

అధిక కట్నం వేధింపులపై కేసు నమోదు

తాడికొండ: అధిక కట్నం కోసం భర్త మానసికంగా, శారీరకంగా వేదిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. రాయపూడి గ్రామానికి చెందిన షేక్ అమర్జాకు విజయవాడకు చెందిన ఇర్ఫాన్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కట్న కానుకల కింద రూ.5 లక్షలు ఇచ్చామని, అధిక కట్నం తీసుకురావాలని భర్త తనను శారీరకంగా, మానసికంగా వేదిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలి

తాడికొండ: బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ కె.చినకోటేశ్వరరావు తెలిపారు. తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు హరించే హెల్ప్‌లైన్ అండగా నిలుస్తుందన్నారు. హెచ్‌ఎం ఏవీవీ ప్రసాద్, మహిళా సంరక్షణ కార్యదర్శి జయవర్ధని పాల్గొన్నారు.

ప్రేమ పేరిట బాలికకు వేధింపులు

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడు ఆమెను బెదిరించి బలవంతంగా తీసుకెళుతుండగా బాలిక తండ్రి చూసి అడ్డుకున్నాడు. యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటోంది. ఐతానగర్‌కు చెందిన మాతంగి భరత్ కొన్నాళ్లుగా బాలికను అనుసరిస్తున్నాడు. ఆమె ఎటు వెళితే అక్కడకు వెళుతున్నాడు. సోమవారం బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చిన భరత్ ఆమెను బెదిరించి బైక్‌పై బలవంతంగా తీసుకెళుతుండగా అప్పుడే పని నుంచి వచ్చిన బాలిక తండ్రి గమనించి అడ్డుకున్నాడు. భరత్‌పరారవగా, ఈ విషయమై త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

అంతా 'గ్యాస్'యేనా..!

- హద్దూ అదుపు లేకుండా నిత్యావసరాల ధరలు పెరుగుదల
- కంటతడి పెట్టిస్తున్న ఉల్లి, వెల్లుల్లి
- వంటింటికి దూరమవుతున్న కూరగాయలు
- ద్రవ్యోల్బణం కట్టడిలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం
- నాలుగు నెలలకో ఉచిత సిలిండర్‌తో సర్దుబాటు



గ్యాస్ సిలిండర్లు



ఉల్లిపాయలు

తాడేపల్లిరూరల్: నిత్యావసరాల ధరలు నియంత్రణలో ఉండటం లేదు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే చెప్పాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు మండిపోతున్నాయి. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడంతో వంట నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. ఉల్లి ధర రూ.100కు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ అంటూ చేతులు దులుపుకుంది. దీంతో బండెడు కష్టం చేసినా.. సగటు మనిషి తన కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి కనిపించడం లేదు.

ధరలు తగ్గిస్తామన్న హామీ గాలికి..

బియ్యం, పప్పులు, ఉల్లిగడ్డలు, వంట నూనెలు... ఇలా ఒకటేమిటి అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏడాది క్రితం ధరలతో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసర ధరలు గణనీయంగా పెరిగాయనే చెప్పవచ్చు. ఎన్నికల్లో కూటమి నేతలంతా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అస్త్రంగా వాడుకున్నారు. బాదుడే బాదుడు అంటూ చంద్రబాబుతో సహా టీడీపీ కూటమి నేతలంతా ఎద్దేవా చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడితే ప్రజలపై భారాలు తగ్గిస్తామని ఎన్నికల్లో ప్రచారం చేశారు. అనేక అమలు కాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను గాలికి వదిలేశాయనే అనుకోవచ్చు.

ఒక్కసారిగా ఆయిల్ ధరలు జంప్...

ఎన్డీఏ ప్రభుత్వం ఒకేసారి 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడంతో వంట నూనె ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. రెండు నెలల్లో లీటరుకు రూ.40లు అదనంగా పెంచేశారు. ప్రస్తుతం పామాయిల్ లీటరు ధర రూ.136కు చేరగా, ఫ్రీడమ్ ఆయిల్ లీటరు ధర రూ.145కు చేరింది. ఈ ధర కూడా నిలకడగా లేదని ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

నిత్యం పెరిగే ధరలే..

ఉల్లిగడ్డలు కిలో రూ.100కి చేరువలో ఉండగా.. చిన్న ఉల్లిపాయ కిలో రూ. 300కు, మేలు రకం బియ్యం 25 కిలోల బ్యాగు రూ.1,800గా మార్కెట్లో ఉంది. పప్పు దినుసులన్నీ గతంలో ఉన్న ధరలకంటే కిలో రూ.10 నుంచి 20కి పెరిగాయి. గతంలో ఒక్కసారిగా నిత్యావసర వస్తువుల ధరలు ఈ విధంగా పెరిగిన దాఖలాలు లేవు. పెరిగిన ధరలతో ఒక్కో సామాన్య కుటుంబంపై నెలకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు అదనపు భారం పడుతోందని చెప్పవచ్చు. ఓ వైపు నిత్యావసరాల ధరలు పెంచేసి, మరో వైపు వంట గ్యాస్ ఉచితంగా ఇచ్చి ఏం లాభమని సామాన్యులు వ్యాఖ్యానిస్తున్నారు.

కార్తిక మాసంలో ధరల భారం

ప్రస్తుతం కార్తిక మాసం నడుస్తోంది. మహిళలు ఎక్కువగా పూజా కార్యక్రమాల్లో, గుళ్ల గోపురాల చుట్టూ తిరుగుతుంటారు. పూజల్లో ముఖ్యమైనది కొబ్బరి కాయ. నువ్వుల నూనె కార్తిక దీపం వెలిగించేందుకు వినియోగిస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొబ్బరి కాయ రూ.40కి చేరింది. రూ.100కి వచ్చే నువ్వుల నూనె ఇప్పుడు రూ. 140కి చేరింది. కార్తిక దీపం వెలిగించాలన్నా, కొబ్బరి కాయ కొట్టాలన్నా పేదలు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన నిత్యావసరాల ధరలు ఇలా

కిలో	ధర(కేజీ..రూ.ల్లో)
సన్ ఫ్లవర్ ఆయిల్	145
పామాయిల్	136
కందిపప్పు	190
మినపప్పు	160
చింతపండు	140
వెల్లుల్లి	400
టమాటా	60
ఉల్లిపాయలు	100
బంగాళదుంప	80
వంకాయ	80
అల్లం	150
క్యారెట్ / చిక్కుడు	80

కళ్లకు గంతలతో కార్మికుల నిరసన



దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయం చేయాలంటూ మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె. ఆదినారాయణ మాట్లాడుతూ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన ప్రకారం యాజమాన్యంతో చర్చలకు కూర్చోబెట్టి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోర్టుల తీర్పులను లెక్క చేయక, కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం చర్చలకు వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, నరసింహారావు, నీరుడు దుర్గారావు, బి. అంకయ్య, సాంబయ్య, సుబ్బారావు, కృష్ణ, నవనీతం, సారమ్మ, దుర్గమ్మ, రమాదేవి, ఇమాంబి పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న రమేష్ తదితరులు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం మాదక ద్రవ్యాలు – ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ బి. రమేష్ మాట్లాడుతూ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యాసరచన పోటీలో మొదటి బహుమతిని ఎం. దివ్యశ్రీ, రెండవ బహుమతిని పి.పూజిత, మూడవ బహుమతిని ఆర్.అలేఖ్యరెడ్డి గెలుచుకున్నారు. ప్రిన్సిపల్ జి. సుబ్బారావు విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు బి. శ్రీదేవి, ఇ.ఆనందరావు, ఎం.రామచంద్రారెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రదర్శన సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : ఈ నెల 26న గుంటూరు శంకర్ విలాస్ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న ప్రదర్శన సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం దుగ్గిరాల ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం, సీఐటీయూ, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో.. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి శివశంకరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20 వేలు ఇంత వరకు రైతుల ఖాతాలో జమ చేయలేదన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అశోక రాణి

మేడికొండూరు: విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్ ప్రిన్సిపల్ కోనూరి అశోకరాణి జయకుమార్ అన్నారు. వీవీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 16న నిర్వహించిన బాలోత్సవ్ కార్యక్రమంలో ఇంటెల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఏకపాత్ర విభాగంలో ఝాన్సీ లక్ష్మీబాయి పాత్రధారి ఎం.వెంకట పూజ కన్సోలేషన్ బహుమతి, నాటికలు విభాగంలో కార్తీక్ కుమార్ అండ్ టీం మొదటి బహుమతి సాధించారు. బహుమతి సాధించిన విద్యార్థులకు ఇంటెల్ హైస్కూల్‌లో సోమవారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కోనూరి అశోకా రాణి జయకుమార్ మాట్లాడుతూ కళలు విద్యార్థుల జీవితాల్లో నూతన ఆలోచనల్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు మంచి వాతావరణంలో ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.సుకన్య, పిల్లలు విజయం సాధించడానికి ముఖ్య కారకులైన ఇంటెల్ స్కూల్ పీడీ ఎస్.కె రన్ను హుస్సేన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

స్వచ్ఛ మంగళగిరి లక్ష్యం

రీజినల్ డైరెక్టర్ హరికృష్ణ.. పారిశుద్ధ్య పనుల పరిశీలన



మంగళగిరి: స్వచ్ఛ మంగళగిరి లక్ష్యంగా పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం కమిషనర్ అలీం బాషాతో కలిసి నగరంలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆర్‌టీఎంఎస్ పనితీరుపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీ మాట్లాడుతూ ఆర్‌టీఎంఎస్ స్కానర్‌ల వల్ల ప్రతి ఇంటిలో చెత్త సేకరణ జరుగుతుందా అని తెలుస్తుందన్నారు. ఇంటింటికి తిరిగి సిబ్బంది చెత్త సేకరణ చేయడం ద్వారా నగరం పరిశుభ్రంగా ఉండడంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

బహిరంగ మల విసర్జనతో వ్యాధులు



ఫిరంగిపురం: బహిరంగ మలవిసర్జన కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న అన్నారు. వేములూరిపాడు ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. కార్యదర్శి మాట్లాడుతూ మరుగుదొడ్లు వాడటం ద్వారా ఎటువంటి వ్యాధులు రావన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కటికల రామకోటేశ్వరరావు, కొరివి ఆనంద్ పాల్గొన్నారు.

నేడు పరిచయ కార్యక్రమం

తాడికొండ: మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమం గుంటూరులోని సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. సాయంత్రం 3 గంటలకు పాల్గొనాలని పేర్కొన్నారు.

మరుగుదొడ్లపై అవగాహన కార్యక్రమం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

తాడేపల్లిరూరల్ : అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవాన్ని దుగ్గిరాల మండలంలోని పలు పంచాయతీల్లో మంగళవారం నిర్వహించారు. మరుగుదొడ్లు – మన ఆత్మగౌరం అవగాహన ర్యాలీలు చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి బీవీ సాయి కుమార్ పాల్గొన్నారు. దుగ్గిరాల గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మంచికల పూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్ వాడీ టాయిలెట్స్‌ను పరిశీలించారు. చిలువూరు గ్రామ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేతి పంపును గ్రామ సర్పంచ్ చిలువూరి మాణిక్యంతో కలసి ప్రారంభించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయరాదని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల స్వామి, విస్తరణ అధికారి కె.జవహర్‌లాల్ నెహ్రూ, దుగ్గిరాల పంచాయతీ కార్యదర్శి వివేకానంద, పెదపాలెం కార్యదర్శి వెంకటరావు, మండల ఎడ్యుకేషన్ అధికారి–2 లక్ష్మీనారాయణ, ఎస్.బి.ఎం. కో–ఆర్డినేటర్ రాజేష్‌బాబు, దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ ఖుషీబాయి, చిలువూరు తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, గూడు వెంకటరావు, దేవరపల్లి చంటి, నక్క చిరంజీవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మున్సిపల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తెనాలి: గుడివాడలో ఈనెల 16 ,17 తేదీల్లో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ఆరుగురు, 16–18 తేదీల్లో కాకినాడలో జరిగిన అండర్–19 హాకీ పోటీల్లో మరో ముగ్గురు పాల్గొని రాష్ట్రస్థాయి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి మంగళవారం ఆ విద్యార్థులను అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో వివిధ కేటగిరీల్లో లీలా గాయత్రి ప్రసన్న, సయ్యద్ సమీరా(8వ తరగతి), పెనుమూడి బ్యూలా, జ్యోత్స్న ప్రియ, నవ్య, కొమరగిరి శివయ్య (9వ తరగతి) పాల్గొన్నారు. కాకినాడలో జరిగిన హాకీ పోటీల్లో షేక్ రియాజ్ (8వ తరగతి), షేక్ హనీఫ్, షేక్ సుహాన (9వ తర గతి) పాల్గొన్నారని వ్యాయమ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి ,కొడాలి గోవర్ధన తెలియచేశారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, బి.శ్రీనివాస్, చక్రవర్తి, సోమరౌతు శ్రీనివాసరావు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కరపత్రం ఆవిష్కరించిన నిర్వాహకులు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. సంబంధిత కరపత్రాన్ని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు శ్రీస్వామివారికి విశేషపూజ, అనంతరం కూచిపూడి నృత్యప్రదర్శన, అన్నమాచార్యుల సంకీర్తనల ఆలాపన అనంతరం శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్‌కుమార్, సభ్యులు గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, వుప్పల వరదరాజులు, మూర్తి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, రమణ కుమార్, వెంకటేష్, సురేష్, లీలాప్రసాదరావు, రమణకుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థినులతో ఎంపీడీవో చందన



నూతక్కిలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళి



నూతక్కి(మంగళగిరి)/ఫిరంగిపురం/తాడేపల్లిరూరల్/మేడికొండూరు/తాడికొండ: గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులకు గ్రంథాలయ అధికారులు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

- నూతక్కి శాఖ గ్రంథాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. గ్రామ పెద్దలు శివరామిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.నరసింహారావు పాల్గొన్నారు.
- మంగళగిరి పట్టణంలోని గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. విశ్రాంత టీచర్ వై.నాగకుమారి, గ్రంథాలయ అధికారి ఎస్.ఆరోగ్యం పాల్గొన్నారు.
- ఫిరంగిపురం మండల కేంద్రంలోని గాలిబాలి గ్రంథాలయంలో విద్యార్థులకు మెహిందీ పోటీలు నిర్వహించారు. సెయింట్ ఆన్స్ పాఠశాలలు, అల్లంవారిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు. గ్రంథాలయ ఇన్‌చార్జి పెరికల జేమ్స్‌బాబు పరిశీలించారు. బీడీసీఎల్‌వోలు దివి కృష్ణమూర్తి, షేక్.సైదాసాహెబ్ పాల్గొన్నారు.
- తాడేపల్లి పట్టణ పరిధిలోని గ్రంథాలయంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సుబ్బాయమ్మ, కె.సాయి వైష్ణవి, టి.స్వర్ణలత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి నాగూర్ బాషా పాల్గొన్నారు.
- మేడికొండూరు గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ తోట చందన, సర్పంచ్ పూల నాగమణి పాల్గొన్నారు. ప్రతి రోజు గ్రంథాలయాలకు వెళ్లి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థినులకు మెహిందీ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిని సుధారాణి పర్యవేక్షించారు.
- తుళ్లూరు, తాడికొండ మండలాల్లో విద్యార్థినులకు మెహిందీ పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు. తుళ్లూరు పంచాయతీ కార్యదర్శి పీవీ రమణ, గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు సందర్శన



మేడికొండూరు : మండలంలోని పేరేచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఎంపీడీఓ తోట చందన సోమవారం సందర్శించారు. శిబిరంలో సుమారు 50 నవీకరణలు/ఎన్‌రోల్‌మెంట్‌లు జరిగాయి. 20వ తేదీ కూడా పేరేచర్లలో ఆధార్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ కుర్ర భరత్, సారా ఉన్నారు.